సాక్షి బాపట్ల

మంగళవారం ၊ 25 ၊ మార్చి ၊ 2025



కారు బోల్తా

పిడుగురాళ్లరూరల్: టైర్ పంక్చరై కారు బోల్తా పడిన సంఘటన పిడుగురాళ్ల మండలం కామేపల్లి బైపాస్‌పై సోమవారం జరిగింది. ఘటనలో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి.



ఖురాన్ గ్రంథాలు అందజేత

పట్నంబజారు: పొన్నూరు రోడ్డులోని ఉమే హాజి బాలిక్ బాణాత్ మదర్సాకు వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు షేక్ నూరిఫాతిమా సోమవారం పవిత్ర ఖురాన్ గ్రంథాలను బహూకరించారు.



క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ

రాజాపాలెం: క్షయరహిత గ్రామాలే లక్ష్యం కావాలని డాక్టర్ రవితేజ నాయక్ తెలిపారు. రాజాపాలెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం టీబీ డే సందర్భంగా ర్యాలీ నిర్వహించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (మంగళ)	సహర్ (బుధ)
బాపట్ల	6.25	4.52
నరసరావుపేట	6.27	4.54
గుంటూరు	6.25	4.52

న్యూస్‌రీల్

సబ్‌జైలును పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి



రేపల్లె రూరల్: రేపల్లె సబ్‌జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి సోమవారం సందర్శించారు. జైలులోని పరిసరాలను, ఖైదీల గదులను, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి ఖైదీలతో మాట్లాడారు. నేరం ఆరోపించబడి ప్రైవేటు న్యాయవాదిని ఏర్పరుచుకోలేని వారి కోసం ప్రభుత్వం ఉచిత న్యాయసేవలు అందించేందుకు ప్రభుత్వ న్యాయవాదిని ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వ న్యాయవాది సేవలను వినియోగించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి సయ్యద్ జియావుద్దీన్, ప్యానెల్ న్యాయవాది గుమ్మడి కుమార్‌బాబు, సబ్‌జైలు సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రుక్మిణీ అలంకారంలో నృసింహుడు



మంగళగిరి: మంగళాద్రిలోని లక్ష్మీ నృసింహ స్వామి సోమవారం రాత్రి రుక్మిణీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆస్థాన అలంకారోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుని తరించారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈవో ఏ రామకోటిరెడ్డి ఉత్సవాన్ని పర్యవేక్షించారు. మంగళవారం స్వామి స్తంభోద్భవం అలంకారంలో దర్శనమివ్వనున్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 520.60 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 6,041 క్యూసెక్కులు విడుదలవుతోంది.

మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయం

జిల్లా మత్స్యశాఖ అధికారి సంజీవరావు



విజయపురిసౌత్: మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా మత్స్యశాఖ అధికారి సంజీవరావు అన్నారు. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి ఆదేశాలతో మాచర్ల మండలం అనుపు వద్ద కృష్ణా జలాశయంలోకి 10 లక్షల చేప పిల్లలను సోమవారం విడుదల చేశారు. అనంతరం సంజీవరావు మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గత వారంలో సైతం 10 లక్షల చేప పిల్లలు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. అలి వలలతో చేపల వేట చేస్తే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. మత్స్య సంపదను కాపాడుకోవాలని సూచించారు. ఎఫ్‌డీఓ టీవీఏ శ్రీనివాసరావు, అగ్రికల్చర్ ఏఓ జగదీష్, మత్స్యశాఖ తనిఖీ అధికారి వెంకట రమణ, గ్రామ మత్స్య సహాయకులు లీలావతి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బంతి బంతికీ బెట్టింగ్

- ఛిద్రమవుతున్న జీవితాలు
- గ్రామాలకు పాకిన బెట్టింగ్ భూతం
- జిల్లాలో కోట్లకు పెరిగిన పందేలు
- ఆఫ్‌లైన్ కంటే ఆన్‌లైన్‌లో జోరుగా పందేలు
- చీరాల కేంద్రంగా పెద్దఎత్తున బుకీ ఏజెంట్లు
- కట్టడి చేయలేని స్థితిలో ఖాకీలు



చీరాల: ఐపీఎల్ క్రికెట్ పోటీలను చూసి కొందరు ఎంజాయ్ చేస్తుంటే.. మరికొంతమంది తమ కుటుంబాలను చిన్నాభిన్నం చేసుకుంటున్నారు. బెట్టింగ్ భూతం కారణంగా అప్పుల పాలవుతున్నారు. ఇంజినీరింగ్, పాఠశాలలో చదివే విద్యార్థులు సైతం పాకెట్ మనీగా తెచ్చుకున్న డబ్బులతో బెట్టింగ్‌లు పెడుతున్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆఫ్‌లైన్ కంటే ఆన్‌లైన్‌లోనే బెట్టింగ్ యాప్‌లు, క్రికెట్ యాప్‌ల ద్వారానే అధికంగా పందేలు కాస్తున్నారు. చీరాలలో కోట్లాది రూపాయలు బెట్టింగ్ కారణంగా చేతులు మారుతున్నాయి. ఇందుకు వేటపాలెం నుంచి ఈపూరుపాలెం వరకు పెద్ద ఎత్తున బుకీలుగా ఏజెంట్లు కథ నడుపుతున్నారు.

బెట్టింగ్ యాప్‌లతో మోసం

ఒకే చోట కూర్చొని బెట్టింగ్‌లు జరుగుతుంటే పోలీసులు నిఘా పెట్టి పట్టుకునేవారు. దీంతో బెట్టింగ్ బాబులు రూటు మార్చారు. బెట్ 365 అనే ఆన్‌లైన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసి ఫోన్ల ద్వారానే బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. పోలీసుల నిఘాకు అందకుండా ఇంట్లోనే ఉంటూ బుకీ ఏజెంట్లు బెట్టింగ్ రాయుళ్లతో బంతి బంతికి, ఓవర్ ఓవర్‌కు బెట్టింగ్ కాయిస్తున్నారు. క్రికెట్ బెట్టింగ్ అంతా ఇప్పుడు ఆన్‌లైన్, ఆఫ్ లైన్ ద్వారా జోరుగా జరుగుతూనే ఉంది. పందెం గెలిచిన గంటల్లోనే డబ్బులు ఆన్‌లైన్ పేమెంట్ చేస్తుండడంతో బెట్టింగ్ జోరుగా జరుగుతోంది. బాపట్ల జిల్లాలో చీరాల, పర్చూరు. బాపట్ల కేంద్రంలో బెట్టింగ్ కోట్లాది రూపాయల్లో జరుగుతోంది.

ఎందరో ప్రాణాలు కోల్పోయారు..

- గతంలో క్రికెట్ బెట్టింగ్ కారణంగా తీవ్ర అప్పులపాలై అప్పులు తిరిగి చెల్లించలేక మానసిక వేదనతో పేరాలలోని ఓ హోటల్ యజమాని తనయుడు ఆత్మహత్యకు పాలయ్యాడు.
- గడియార స్తంభం సెంటర్‌లో మెడికల్ షాపు నిర్వాహకుడు బెట్టింగ్ కోరలలో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయాడు.
- పేరాలలోని ఓ వ్యాపారి తన వ్యాపారాన్ని బెట్టింగ్ కారణంగా వదిలేసి అప్పులపాలై తనువు చాలించాడు. ఇటువంటి ఘటనలు చీరాలలో బహిర్గతం కానివి చాలా ఉన్నాయి.

బార్లే వేదికగా...

బార్ అండ్ రెస్టారెంట్లలో తమ వ్యాపారం కోసం పెడుతున్న ప్రొజెక్టర్ ద్వారా తెరలపై ఐపీఎల్ మ్యాచ్‌లను వేస్తున్నారు. అయితే చాలా మంది అనుమానం రాకుండా రెస్టారెంట్‌కు వచ్చినట్లుగా వ్యవహరిస్తూ బెట్టింగ్‌లు కాస్తున్నారు.

గ్రామాలకు పాకిన బెట్టింగ్ భూతం..

నిన్నమొన్నటి వరకు పట్టణాలకే పరిమితమైన బెట్టింగ్ భూతం నేడు గ్రామాలకు పాకింది. అక్కడా బుకీ ఏజెంట్లు ఏర్పడ్డారు. బెట్టింగ్‌కు అలవాటు పడిన కొందరు బుకీ ఏజెంట్లు గ్రామస్తుల నుంచి డబ్బులు, స్థిరాస్తులను సైతం వాటిపై బెట్టింగ్ కాస్తున్నారు. ముఖ్యంగా కారంచేడు, ఇంకొల్లు, పర్చూరుతో పాటు చీరాలలో కూడా పలు గ్రామాలలో ఈ బెట్టింగ్ పెద్దఎత్తున జరుగుతోంది.

చితుకుతున్న కుటుంబాలు

చీరాల ప్రాంతంలో అధికంగా నివసించే చిన్నా, మధ్యతరగతి కుటుంబాల వారు ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుని విలవిల్లాడుతున్నారు. కొందరు ప్రాణాలు తీసుకుంటే మరికొందరు ఊరు వదిలివెళ్లిపోతున్నారు. బెట్టింగ్‌ల కోసం చేసిన అప్పులు చెల్లించలేని స్థితిలో వడ్డీ వ్యాపారులు పెట్టే ఇబ్బందులు తట్టుకోలేక ఇళ్లలోని బంగారం తాకట్టు పెడుతున్నారు. ఎన్నో కుటుంబాలు వీధిన పడుతున్నాయి. బెట్టింగ్ భూతాన్ని పోలీసులు నిలువరించాలని ప్రజలు కోరుతున్నారు.

చీరాలలో 10 మంది ఏజంట్లు

యువకులు, బంగారు వ్యాపారులు, వస్త్ర వ్యాపారులు లక్షలాది రూపాయలు బుకీల ద్వారా పందేలు కాస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారా పేరాలలో ఇద్దరు బుకీలు పందేలు నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. కంప్యూటర్‌తోపాటు ఫోన్ ద్వారా ఎప్పటికప్పుడు బుకీల ద్వారా సమాచారం తెలుసుకుని స్థానికంగా బెట్టింగ్‌లు వేస్తున్నారు. చీరాలలో 10 మందికి పైగా బుకీ ఏజెంట్లు ఉన్నారు. జాండ్రపేటలో ఇద్దరు, వేటపాలెంలో ఇద్దరు, ఈపూరుపాలెంలో ఇద్దరు ఏజెంట్లు, చీరాల ప్రాంతాలలో జరిగే బెట్టింగ్‌లను నడుపుతున్నారు. పోలీసులకు సమాచారం తెలియకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. లావాదేవీలంతా ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయి. ఫలితాన్ని బట్టి డబ్బు అందుతుంది. ఇందుకు నమ్మకస్తులను మాత్రమే ఎంచుకుంటున్నారు బుకీ ఏజెంట్లు. నమ్మకం లేని వారి వద్ద ముందే డబ్బు డిపాజిట్ చేసుకుంటున్నారు.



కృష్ణా జిల్లా శ్రీకాకుళం ఇసుక క్వారీ నుంచి గాలు మార్గం ద్వారా బాపట్ల జిల్లాలోకి ప్రవేశిస్తున్న ఇసుక లారీలు

హద్దులు దాటుతున్న ఇసుక

- కృష్ణా జిల్లాలో ఉచిత ఇసుక క్వారీ
- ఉమ్మడి గుంటూరు జిల్లాకు తరలింపు
- గాలు రోడ్డే అక్రమాలకు మార్గం
- పట్టించుకోని అధికారులు

కొల్లూరు: కూటమి నేతలు ఇసుకను అక్రమ మార్గంలో హద్దులు దాటిస్తున్నారు. అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కృష్ణా జిల్లా ఘంటసాల మండలం శ్రీకాకుళం ప్రాంతంలో ఉచిత ఇసుక క్వారీ ఉంది. ఇసుకను భారీ లారీలలో నింపి దొడ్డిదారిలో బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాలకు అక్రమంగా తరలిస్తున్నారు. బాపట్ల జిల్లా కొల్లూరు మండలం గాజుల్లంక, కృష్ణా జిల్లా శ్రీకాకుళం గ్రామాల నడుమ వ్యవసాయ కార్యకలాపాలు, ప్రయాణికుల రాకపోకల కోసం ఏర్పాటు చేసిన గాలు మార్గం వారి అక్రమాలకు రాచమార్గంగా మారింది. రోజుకు 100 ఇసుక లారీలు అక్రమంగా తరలివెళుతున్నాయి.

బిల్లులు నిల్

నిబంధనల మేరకు రీచ్‌ల నుంచి ఇసుక రవాణా చేసే వాహనాలు రోడ్డు మార్గం ద్వారా ప్రయాణించి ఇతర జిల్లాల్లోకి బిల్లులతో ప్రవేశించాల్సి ఉంది. అయితే ఉచిత ఇసుక క్వారీలను దక్కించుకున్న కూటమి నాయకులు బిల్లులు లేకుండానే బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లా లకు ఇసుకను యథేచ్ఛగా అక్రమంగా తరలిస్తున్నారు.

పట్టించుకోని యంత్రాంగం

కృష్ణా జిల్లా నుంచి నదిలోని గాలు మార్గం ద్వారా బిల్లులు లేకుండా ఇసుక అక్రమంగా జిల్లాలోకి వస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. పగలు, రాత్రి తేడా లేకుండా అధిక సంఖ్యలో వాహనాలు గాజుల్లంక, పెసర్లంక, కొల్లూరు, పోతార్లంక, దోనేపూడి, కిష్కిందపాలెం, తోకలవారిపాలెం మీదుగా తరలివెళుతున్నాయి. రెవెన్యూ, పోలీసు, మైనింగ్ శాఖల అధికారులు మాత్రం స్పందించడంలేదు. పెసర్లంక–కొల్లూరు రహదారి పనులు జరుగుతున్న తరుణంలో ఇసుక లారీల నుంచి కారుతున్న నీరు కారణంగా రోడ్డు మన్నిక ప్రశ్నార్థకంగా మారుతుంది.

కూలీల కడుపుకొడుతున్నారు

ఉచిత ఇసుక క్వారీలలో తవ్వకాలకు కూలీలను మాత్రమే వినియోగించాలన్న నిబంధనకు తూట్లు పొడుస్తున్నారు. కాంట్రాక్టర్లు యంత్రాలను వినియోగిస్తున్నారు. నదిలో ట్రాక్టర్లు దిగి కూలీలతో ఇసుక నింపకుండా గుంతలు తీసి అడ్డుకుంటున్న అధికారులు పక్క జిల్లా నుంచి అక్రమ మార్గంలో ఇసుకరవాణా జరుగుతున్నా పట్టించుకోలేదు.

పరిశీలించి చర్యలు

నదిలో అక్రమ మార్గం ద్వారా జిల్లాలోకి ఇసుక రవాణాను అరికట్టే విషయంలో రూల్స్‌ను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. మైనింగ్ శాఖాధికారులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి కృష్ణా నదిలో జిల్లా దాటి బిల్లులు లేకుండా వాహనాలు వస్తే ఎటువంటి చర్యలు తీసుకోవాలన్న అంశాన్ని పరిశీలిస్తాం.

– బి.వెంకటేశ్వర్లు, తహసీల్దార్, కొల్లూరు.

పరిష్కార వేదికకు అర్జీల వెల్లువ

170 అర్జీలు స్వీకరించిన కలెక్టర్

బాపట్లటౌన్: జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి బాధితులు రోజు రోజుకు పెరిగిపోతున్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారం కాకపోవడంతో తిరిగి కలెక్టర్ కార్యాలయానికి చేరుకోవాల్సి వస్తుందని బాధితులు వాపోతున్నారు. జిల్లా నలుమూలల నుంచి సోమవారం 170 మంది అర్జీదారులు కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని తమ సమస్యలపై కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లకు వినతిపత్రాలు అందజేశారు.



జిల్లా కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న బాధితులు

చిన్నారావు చెరలు భరించలేకపోతున్నాం

నగరం మండలం సిరిపూడి ఎస్సీ కాలనీకి చెందిన గొర్రుముచ్చు చిన్నారావు పెడుతున్న చెరలు మేము భరించలేకపోతున్నాం. చుట్టుప్రక్కల గ్రామాల్లోని అమాయకులైన రైతుల పొలాలను కొందరు నాయకులు, అధికారుల అండతో కబ్జా చేస్తున్నాడు. గతంలో చందోలు సంతబజార్, మట్లపూడి ఎస్సీకాలనీ, పెదమట్లపూడి గ్రామాల్లోని కొందరు రైతులను బెదిరించి వారి వద్ద కొంత నగదు తీసుకున్నాడు. ప్రస్తుతం జి.ఎన్.పాలెం గ్రామానికి చెందిన సమ్మెట మంగమ్మకు చెందిన ఆస్తిపై కన్నేసి ఆమెను ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. అతనిపై చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలి.

– జి.ఎన్.పాలెం రైతుల అవేదన

దివ్యాంగులకు రక్షణలేదు



నా ఇంటికి ఎదురుగా డాక్టర్‌కి చెందిన స్థలం ఉంది. ఆ స్థలంలో అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న మునిపల్లి సుబ్బయ్య కార్లు పార్కింగ్ చేస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న డాక్టర్ వచ్చి ఖాళీ చేయించారు. దీనికి మేమే కారణమని మనస్సులో పెట్టుకొని నిత్యం నన్ను దుర్భాషలాడటంతోపాటు ఈ ఏడాది ఫిబ్రవరి 17న దాడి కూడా చేశాడు. ఈ విషయంపై రేపల్లె పోలీసులకు, ఎస్పీకి పలుమార్లు లిఖితపూర్వకంగా ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదు. దివ్యాంగుడినైన నేను 70 కిలోమీటర్లు ప్రయాణం చేసి నాలుగుసార్లు తిరిగినా కనికరం చూపడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాపై దాడిచేసిన వ్యక్తిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.

– షేక్ సుభానీ,దివ్యాంగుడు, రేపల్లె

సంపద సరే... సరుకులేవి బాబుగారూ

మేము అధికారంలోకి వస్తే సంపద సృష్టిస్తానంటూ ఎన్నికలకు ముందు ప్రచారాలు ఊదరకొట్టారు. సీఎం అయిన తర్వాత పేదలకు పంపిణీ చేసే నిత్యావసర సరుకుల్లోనే కోతలు విధించారు. సంపద సంగతి దేవుడెరుగు కనీసం పేదలకు రేషన్‌దుకాణాల ద్వారా పంపిణీ చేసే కందిపప్పు పంపిణీ చేయండి, కందిపప్పు సరఫరా లేకపోవడంతో నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఇప్పటివరకు ఒక్కదానిని కూడా పూర్తిస్థాయిలో అమలుచేసిన దాఖలాలు లేవు.

– జై భీమ్‌రావు భారత్‌పార్టీ నాయకులు

నిబంధనలకు విరుద్ధంగా తొలగించారు

చీరాల: మున్సిపాలిటిలో వివిధ విభాగాల్లో పనిచేసే ఉద్యోగులను నిబంధనలకు విరుద్ధంగా చీరాల మున్సిపల్ కమిషనర్ తొలగించారు. తిరిగి ఉద్యోగం కల్పించి ఉపాధి కల్పించాలి. చీరాల మున్సిపల్ ఆప్కాస్ ఉద్యోగులు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఆప్కాస్‌లో ఉన్న ఉద్యోగులను నిబంధనలకు విరుద్ధంగా తొలగించారని, ఆదేమిటని కమిషనర్‌ని అడిగితే జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తొలగించామని చెప్పారన్నారు. అలానే విధులకు హాజరవుతున్నప్పటికి జీతాలు ఇవ్వకుండా కమిషనర్ ఇబ్బంది పెడుతున్నారన్నారు. ఆప్కాస్ నిబంధనలకు విరుద్ధంగా తొలగించిన తమను తిరిగి విధుల్లోకి తీసుకొని ఉపాధి కల్పించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో ఆప్కాస్ ఉద్యోగులు దాసరి మణికంఠ, కె.విజయలక్ష్మి, జ్యోతుల డేవిడ్, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదు చేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది

చుండూరు అడ్డాగా రేషన్ బియ్యం తరలింపు

- నడిగడ్డి వారి పాలెం రైస్ మిల్లు నుంచి ఇతర రాష్ట్రాలకు
- తనిఖీలకు వెళితే ఎమ్మెల్యే నుంచి ఫోన్లు
- అధికారులపై దాడులు చేస్తున్న కుక్కలు



వాహనంలో తరలిస్తున్న బియ్యం

వేమూరు: అక్రమ రేషన్ బియ్యం తరలింపుకు చుండూరు మండలం అడ్డాగా మారింది. వేమూరు నియోజకవర్గంలో అక్రమ రేషన్ బియ్యం తరలింపు జోరుగా సాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు అంటున్నారు. నియోజకవర్గంలోని వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, అమర్తలూరు, చుండూరు మండలాల నుంచి రేషన్ బియ్యం అక్రమంగా రైస్ మిల్లులకు తరలిస్తున్నారు. రైస్ మిల్లు నుంచి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. వేమూరు నియోజకవర్గంలోని చుండూరు మండలంలోని నడిగడ్డవారిపాలెం గ్రామంలో రైస్ మిల్లు నుంచి ఇతర రాష్ట్రాలకు బియ్యం అక్రమంగా తరలిస్తున్నా పౌరసరఫరాల శాఖ అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులు, పోలీసులు పట్టించుకోకపోవడంతో ఇష్టారాజ్యంగా అక్రమ రేషన్ బియ్యం తరలింపు జోరుగా సాగుతుంది. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అండతో అక్రమ రేషన్ బియ్యం వ్యాపారం సాగుతుందని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు ఆరోపిస్తున్నారు.

అధికారులకు ఎమ్మెల్యే ఫోన్

చుండూరు మండలంలోని నడిగడ్డవారిపాలెం గ్రామంలో అక్రమ రేషన్ బియ్యం తరలించే రైస్ మిల్లు వద్దకు రెవెన్యూ అధికారులు, పౌర సరఫరాల శాఖ అధికారులు వెళితే ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఫోన్ రావడంతో అధికారులు తిరిగి వస్తున్నారు. గతేడాది అక్టోబర్ నెలలో పౌర సరాఫరాల శాఖ అధికారులు రైస్ మిల్లులో అక్రమ రేషన్ బియ్యం పట్టుకున్నారు. తహసీల్దారు నాగరాజు రైస్ మిల్లు వద్దకు వెళుతుంటే ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఫోన్ రావడంతో తిరిగి వచ్చారు. దీంతో అధికారులు రైస్ మిల్లుపై దాడులు చేసేందుకు భయపడుతున్నారు.

అధికారులపై కుక్కలు దాడులు

అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న రైస్ మిల్లులో కుక్కలు అధికారులపై దాడులు చేస్తాయి. దీంతో రైస్ మిల్లు వద్దకు అధికారులు వెళ్లటానికి కూడా భయపడుతున్నారు. అక్రమ రేషన్ బియ్యం వ్యాపారం చేస్తున్న బాల కోటిరెడ్డి రైస్ మిల్లులో కుక్కలను పెంచుతున్నాడు. రాత్రులు, పగలు సమయంలో కుక్కలను వదిలి పెడతాడు. దీంతో రైస్ మిల్లుపై వివిధ శాఖల అధికారులు దాడులకు వెళితే కుక్కలు దాడులు చేయడం జరుగుతుంది. అందువల్ల అధికారులు రైస్ మిల్లు వద్దకు వెళ్లాలి అంటేనే భయపడుతున్నారు. ఇక్కడ రైస్ మిల్లు నుంచి అక్రమ రేషన్ బియ్యం లారీలు ఇతర రాష్ట్రాలకు వెళుతున్నా అధికారులు పట్టించుకునే పరిస్థితి లేదు.

నా దృష్టికి రాలేదు



చుండూరు మండలంలోని నడిగడ్డవారి పాలెం గ్రామంలో రైస్ మిల్లులో అక్రమ రేషన్ బియ్యం ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్న విషయం నా దృష్టికి రాలేదు. అక్రమ రేషన్ బియ్యం తరలించకుండా చర్యలు తీసుకుంటా.

– నాగరాజు, తహసీల్దారు, చుండూరు మండలం

చిన్నగొల్లపాలెం గ్రామంలో పింఛన్ల పంపిణీ

- హాజరుకానున్న సీఎం చంద్రబాబు
- జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: పేదల సేవలో పింఛన్ పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చినగంజాం మండలం చిన్న గొల్లపాలెం గ్రామానికి రానున్నారని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి చెప్పారు. ఏప్రిల్ ఒకటో తేదీన సీఎం పర్యటన ఖరారు నేపథ్యంలో జిల్లా అధికారులతో సోమవారం స్థానిక పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన జయప్రదం చేసేలా అధికారులు ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. పర్చూరు నియోజకవర్గం పరిధిలోని చిన్నగంజాం మండలం పెద గంజాం రెవెన్యూ గ్రామం చిన్న గొల్లపాలెం గ్రామాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి సందర్శిస్తారని చెప్పారు. తొలుత వృద్ధులు, ఒంటరి మహిళ, దివ్యాంగులైన లబ్ధిదారులతో మాట్లాడి, వారికి పింఛన్ పంపిణీ చేస్తారు. 45 నిమిషాలపాటు పింఛన్ లబ్ధిదారులతోనే రాష్ట్ర ముఖ్యమంత్రి గడుపుతారని కలెక్టర్ చెప్పారు. తదుపరి ఏర్పాటు చేసే ప్రజావేదిక ద్వారా ప్రజలనుద్దేశించి సభలో సీఎం ప్రసంగిస్తారన్నారు. సభ పూర్తి కాగానే ఒక గంట పాటు పార్టీ కార్యకర్తలతో సీఎం సమావేశం అవుతారన్నారు. తదుపరి జిల్లా అధికారులతో రాష్ట్ర ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహిస్తారని చెప్పారు. ఈ నేపథ్యంలో కార్యక్రమం జయప్రదం అయ్యేలా అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటించే చిన్న గొల్లపాలెం గ్రామాన్ని జిల్లా సంయుక్త కలెక్టర్, ఆర్డీఓ, డీఆర్‌డీఏ పీడీ, డ్వామా పీడీ మరికొంతమంది అధికారులు పరిశీలించాలని కలెక్టర్ చెప్పారు. హెలీప్యాడ్ ప్రాంతం, పింఛన్ పంపిణీ చేసే లబ్ధిదారుల నివాస ప్రాంతం, సభా వేదిక, కార్యకర్తల సమావేశం, అధికారుల సమావేశ వేదికలను పరిశీలించాలన్నారు. తనిఖీ అనంతరం ఆ గ్రామంలో సామాజిక వనరులు, అవసరాలు, మౌలిక సదుపాయాలను గుర్తించి నివేదిక ఇవ్వాలని ఆయన సూచించారు. ఉపాధి హామీ పథకం ద్వారా తక్షణమే చేపట్టే అంశాలపై ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. ఆయా శాఖల ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు, పథకాల అమలు తీరుపై సంక్షిప్త సమాచారంతో నివేదిక సిద్ధం చేసుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్‌గౌడ్, ఆర్డీఓ పి.గ్లోరియా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

క్లుప్తంగా

కొత్త కవులను ప్రోత్సహిద్దాం

నగరంపాలెం(గుంటూరువెస్ట్): స్థానిక బ్రాడీపేటలోని కథా రచయిత్రి తాటికోల పద్మావతి నివాసంలో గుంటూరు జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో సోమవారం కవులందరూ కలిసి 'కవిత్వంతో కాసేపు' నిర్వహించారు. ఈనెల 21 న అంతర్జాతీయ కవితా దినోత్సవం, 30న ఉగాది పండుగ సందర్భంగా కవిత్వంపై చర్చించారు. ఔత్సాహిక కవులను ప్రోత్సహించడమే లక్ష్యంగా సంఘం పని చేద్దామని సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.సుభాని తెలిపారు. కవులు తాము రాసిన కవితతోపాటు సమకాలీన కవులు రాసిన, తమకు నచ్చిన మరో కవిత వినిపించి జయప్రదం చేశారని కోశాధికారి నానా చెప్పారు. సంఘానికి కొత్తగా పరిచయమైన కవులు మెట్టు శ్రీనివాసరెడ్డి, సురేష్, కడంశెట్టి సతీష్‌కుమార్ మాట్లాడారు. ఇది కవి సంగమం అని, సత్సంగమని, అందరూ మర్యాద పూర్వకంగా కలవడం సంతోషంతోపాటు ప్రోత్సాహాన్నిచ్చిందని పేర్కొన్నారు. రచయిత్రి తాటికోల పద్మావతి ఆతిథ్యం, ఆప్యాయతలను కవులు కొనియాడారు. సంఘం ఉపాధ్యక్షులు బొమ్ము ఉమామహేశ్వరరెడ్డి, సభ్యులు ఈవూరి వెంకటరెడ్డి, కొణతం నాగేశ్వరరావు, శ్రీవశిష్ట సోమేపల్లి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల వేతనాలు పెంచాలి

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): కూటమి సర్కారు అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు కావస్తున్నా.. ఇంతవరకు తమ వేతనాలు పెంచలేదని అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ ధ్వజమెత్తారు. పాతగుంటూరులోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం జిల్లా అధ్యక్షురాలు ఏవీఎస్ కుమారి అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీలకు వేతనాలు పెంచకపోగా ఉద్యోగుల పేరుతో కరెంట్ బిల్లులు పెంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కన్న కొడుకే చంపాలని చూస్తున్నాడు

ఎస్పీ ముందు వాపోయిన బాధితులు

బాపట్లటౌన్: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 48 మంది బాధితులు హాజరై తమ సమస్యలను నేరుగా ఎస్పీకి విన్నవించుకున్నారు. బాధితుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ తుషార్ డూడీ, అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ వెంటనే సంబంధిత సీఐ, ఎస్‌ఐలతో మాట్లాడి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు.



బాధితుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ తుషార్ డూడీ

డబ్బులు అడిగితే దాడులు చేస్తున్నారు.



నిజాంపట్నం మీదుళ్ళపర్రలోని 20 ఎకరాల్లో రొయ్యల సాగు చేశాను. మా చెరువుల్లోని 4.5 టన్నుల రొయ్యలను నిజాంపట్టణానికి చెందిన రొయ్యల వ్యాపారులు కన్నా రాజేష్, శేరు జగన్‌లకు విక్రయించాను. మొత్తం రూ.24 లక్షలు రావాల్సి ఉండగా రూ.13 లక్షలు ఇచ్చారు. మిగిలిన రూ.11 లక్షలు ఇవ్వలేదు. డబ్బులు అడిగితే నా భర్త ఇంట్లోలేని సమయంలో మద్యం తాగి వచ్చి ఇష్టమొచ్చినట్లు దుర్భాషలాడుతూ దాడికి పాల్పడుతున్నారు. ఈ విషయంపై నిజాంపట్టణం పోలీసులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడంలేదు. వారి వలన మాకు ప్రాణహాని ఉంది.

– పీతా లావణ్య దంపతులు, నిజాంపట్నం

ధాన్యం తీసుకెళ్లి డబ్బులు ఇవ్వడం లేదు



నేను ఈ ఏడాది నా పొలంలోని ధాన్యాన్ని నరసాయపాలెం గ్రామానికి చెందిన అశోక్‌బాబుకు విక్రయించాను. ఒక్కో బస్తా రూ.1800 చొప్పున 127 బస్తాలు విక్రయించాను. నాకు మొత్తం రూ.2,28,600 రావాల్సి ఉండగా రూ.1,19,400 ఇచ్చారు. మిగిలిన రూ.1,09,200 ఇవ్వాలి ఉంది. ఎన్నిసార్లు అడిగినా సరైన సమాధానం చెప్పడం లేదు. వృద్ధాప్యంలో ఉన్న నన్ను ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

– నక్కల నారాయణ, కంకటపాలెం, బాపట్ల మండలం

ఆస్తి మొత్తం తీసుకున్నారు



నాకు ఇద్దరు మగపిల్లలు, ఒక ఆడపిల్ల సంతానం. వీరిలో పెద్ద కుమారుడు చనిపోయారు. నా చిన్నకుమారుడు సయ్యద్ మోహిద్దీన్, కొడలు నజీమూన్‌లు మా ఆస్తి మొత్తం తీసుకొని నన్ను, నా భర్తను చంపాలని చూస్తున్నారు. భయంతో నా భర్త ఏడాదిన్నర కిందట ఎటో వెళ్లిపోయారు. అసలు ఎక్కడ ఉన్నాడో ఆచూకీ లేదు. నేను ప్రాణభయంతో వేటపాలెంలోని నా కుమార్తె వద్దకు తలదాచుకుంటున్నా. నా కొడుకు, కోడలు చెరనుంచి నన్ను కాపాడండి

– సయ్యద్ కరీమూన్, బొప్పుడి, చిలకలూరిపేట మండలం

భార్యను హత్యచేసిన వ్యక్తికి జీవిత ఖైదు

చినగంజాం: భార్యను హత్యచేసిన కేసులో వ్యక్తికి కోర్టు జీవిత ఖైదు విధించింది. పోలీసుల సమాచారం..బాపట్ల జిల్లా చినగంజాంలోని మహాలక్ష్మి కాలనీకి చెందిన కత్తి శ్రీనుకు తన భార్య కత్తి దుర్గ(30)తో మనస్పర్థలు వచ్చాయి. భర్తతో విభేదించి ఆమె పుట్టింటికి వచ్చింది. తల్లిదండ్రులు మల్లవరపు అంజయ్య, రాఘవమ్మ ఇంట్లో తన పిల్లలతో ఉంటోంది. ఈ గొడవలు మనసులో పెట్టుకున్న శ్రీను గతేడాది జూన్‌లో దుర్గ ఉంటున్న ఇంటికెళ్లి కత్తితో విచక్షణారహితంగా దాడి చేయడంతో ఆమె ఘటనా స్థలంలోనే చనిపోయింది. మృతురాలి తల్లి రాఘవమ్మ ఫిర్యాదు ఆధారంగా అప్పటి ఎస్‌ఐ ఎం.శ్రీనివాసరావు కేసు నమోదు చేయగా, అప్పటి సీఐ బత్తుల శ్రీనివాసరావు దర్యాప్తు చేసి నిందితుడిని రిమాండుకు పంపారు. ఇప్పటి సీఐ వై.వి.రమణయ్య దర్యాప్తు పూర్తి చేసి నివేదికను కోర్టుకు సమర్పించారు. అనంతరం అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.ప్రశాంతి కుమారి వాదనలతో ఏకీభవించిన ఒంగోలు మూడో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి డి.రాములు నిందితుడికి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, రూ.1600 జరిమానా విధించారు.

క్షయ వ్యాధి రహిత గ్రామాల కోసం కృషి



మానవహారం ఏర్పాటు చేసిన వైద్యశాఖ

బాపట్ల: క్షయ వ్యాధి రహిత గ్రామాలు ఏర్పాటు కోసం అందరం కలిసి కట్టుగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి పేర్కొన్నారు. ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని 27 టీబీ రహిత గ్రామాలకు సిల్వర్, బ్రాంజ్ మోడల్స్‌ను సోమవారం అందించారు. జిల్లా కలెక్టర్‌కు సంబంధిత శాఖ అధికారులు మహాత్మాగాంధీజీ విగ్రహాన్ని అందించారు. జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ విజయమ్మ మాట్లాడుతూ క్షయవ్యాధిని అరికట్టేందుకు వైద్యశాఖ అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా బాపట్లలోని పాతబస్టాండ్ వద్ద మానవహారం చేపట్టారు. క్షయవ్యాధిపై ప్రదర్శన చేపట్టారు. ఆరోగ్యశాఖ బెస్ట్ ఎంప్లాయిస్ కింద ఎంపికైన వారికి సర్టిఫికెట్లు ప్రధానం చేశారు.

చిన్నబిడ్డలకు తల్లులు పాలిచ్చు గది ఏర్పాటు సంతోషకరం

కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన చిన్న బిడ్డలకు తల్లులు పాలిచ్చు గదిని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి సోమవారం ప్రారంభించారు. ఏదైనా పనుల నిమిత్తం కలెక్టరేట్‌కు వచ్చే మహిళలకు ఇది ఎంతో సౌకర్యంగా ఉంటుందని చెప్పారు.



చిన్న బిడ్డలకు తల్లులు పాలిచ్చు గదిని ప్రారంభిస్తున్న కలెక్టర్ జె.వెంకట మురళి

పని ప్రదేశాలలో చిన్న బిడ్డలకు తల్లులు పాలిచ్చు గది తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. మహిళలు, చిన్నారుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు, ఇతర పని ప్రాంతాలలోనూ ఇలాంటి గదులు ఏర్పాటు చేసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ పీడీ డి.రాధామాధవి, వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ, సీడీపీవోలు, డీసీపీఓ పురుషోత్తం, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

అగ్రికల్చర్ డైరెక్టర్ డాక్టర్ రామాంజనేయులు

బాపట్ల: వ్యవసాయ రంగంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవటం వలనే రైతులకు ఎంతో మేలు జరుగుతుందని సెంటర్ ఫర్ సస్టైనబుల్ అగ్రికల్చర్ డైరెక్టర్ డాక్టర్ జీ.వి.రామాంజనేయులు పేర్కొన్నారు. బాపట్ల వ్యవసాయ కళాశాల్లో ఆర్థిక శాస్త్ర విభాగం నిర్వహించిన సమావేశంలో డాక్టరు జీ.వి.రామాంజనేయులు మాట్లాడారు. ప్రభుత్వం వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికై చేపట్టిన విధానాల రైతులకు తెలియజేయాలని సూచించారు. విద్యార్థులు ప్రభుత్వ విధానాల పట్ల స్పష్టమైన అవగాహన కలిగివుండాలన్నారు. హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ మార్క్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సీహెచ్.శ్రీనివాసరావు మార్క్‌ఫెడ్ రంగం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. డెయిరీ, ఫిషరీస్ వంటి వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికై ప్రభుత్వ నూతన విధానాలను కూలంకషంగా వివరించారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనరాణి, ఆర్థిక శాస్త్ర విభాగ ప్రొఫెసర్లు డాక్టర్ కె.ఎస్.పాల్, డాక్టర్ ఎస్.హైమజ్యోతి, డాక్టర్ కె.సుశీల, డాక్టర్ బి.అపర్ణ, డాక్టర్ వి.సీతారాంబాబు, 200 మందికి పైగా విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సెంటర్ ఫర్ సస్టైనబుల్ అగ్రికల్చర్ డైరెక్టర్ డాక్టరు జీ.వి.రామాంజనేయులు

పొగాకు తగలబెట్టి నిరసన తెలిపిన రైతులు

నల్లబర్లీ పొగాకు వెంటనే కొనుగోలు చేయాలి

జే.పంగులూరు: నల్లబర్లీ పొగాకు వెంటనే కొనుగోలు చేయాలని రైతు సంఘం, కౌలు రైతు సంఘాలు డిమాండ్ చేశాయి. ప్రైవేటు కంపెనీలు నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేయకపోవడం .. ప్రభుత్వం కూడా రైతులను పట్టించుకోకపోవడంతో నిరసనగా పంగులూరు బస్టాండ్ సెంటర్‌లో సోమవారం రైతులు పొగాకు పంటను తగులబెట్టి నిరసరన తెలిపారు. రైతు సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు మాట్లాడుతూ నల్లబర్లీ కొనుగోలు చేస్తాం సాగు చేయండని రైతులను ప్రోత్సహించి సాగుచేయించిన ప్రైవేటు కంపెనీలు ఇప్పుడు మొహం చాటేశాయని, కొనుగోలు చేసేందుకు ముందుకు రావడం లేదన్నారు. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి రైతులు, కౌలు రైతులు సాగు చేస్తే కంపెనీలు కొనుగోలు చేయకపోవడం దారుణమన్నారు.

నిమ్మకు నీరెత్తిన్నట్లుగా కూటమి ప్రభుత్వం

నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేయకుండా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తిన్నట్లు ఉందన్నారు. గత సంవత్సరం పొగాకు పంట లాభాలు దృష్ట్యా రైతులు ఎక్కువగా ఆ పంట వేసేందుకు మక్కువ చూపారని, బాపట్ల జిల్లాలోని పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల పరిధిలో లక్షల ఎకరాల్లో సాగు చేశారన్నారు. దానికి తోడు నల్లబర్లీ ఎక్కువగా సాగు చేశారని అన్నారు. బర్లీ పొగాకును కూడా బోర్డు పరిధిలోకి తీసుకొని కొనుగోలు చేయాలన్నారు. ఈ విషయంపై ఇప్పటికే కలెక్టర్‌ను, ప్రైవేటు కంపెనీల యాజమన్యాలను కూడా కలిశామన్నారు. వెంటనే పొగాకు పంటను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాయిణి వినోద్‌బాబు, మల్లారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే రైతుల వద్ద ఉన్న నల్లబర్లీ పొగాకు వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



పొగాకు తగులబెట్టి నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

అప్పులు కట్టలేక భార్యాభర్తలు అదృశ్యం

అద్దంకిరూరల్: అప్పులు కట్టలేనని.. ఇంట్లో పుస్తకంలో రాసిపెట్టి భార్యభర్తలు అదృశ్యమయ్యారు. ఈఘటన ఆదివారం అద్దంకి పట్టణంలో జరగ్గా భార్య, తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు ఎస్సై ఖాదర్‌బాషా నమోదు చేశారు. ఎస్సై వివరాల మేరకు అద్దంకి పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన కుంచాల శ్రీనివాసరావుకు ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి ఉన్నారు. వీరిలో పెద్ద కుమార్తె అంజలికి మూడేళ్ల కిందట ఆలకుంట వెంకట్రావుతో వివాహం కాగా అద్దంకిలో ఉంటున్నారు. వెంకట్రావు బేల్దారి పనిచేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ప్రస్తుతం అంజలి గర్భిణి. ఈ క్రమంలో ఆదివారం తల్లి తన కుమార్తె అంజలి ఇంటికి వెళ్లగా ఇంట్లో ఎవరూ కనిపించలేదు. దీంతో కూతురు, అల్లుడు హాస్పటల్‌కు వెళ్లారని భావించి ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ ఆఫ్ అని వచ్చింది. వెంటనే అద్దంకిలోని వైద్యశాలలో చూశారు. అక్కడా కూడా లేకపోవడంతో ఒంగోలులోని పలు వైద్యశాలలు వెతికారు. ఆచూకీ తెలియకపోవడంతో ఇంటికి వచ్చి అన్ని వెతకగా ఒక పుస్తకంలో తాము ఇవ్వాల్సిన అప్పుల జాబితా రాసి ఉంది. 'అవి తాను కట్టలేనని తన ఇల్లు అమ్ముకుని అందరూ తీసుకోవాలని రాసి, తమకోసం వెతకవద్దు ఎవరికి కనబడం ' అని ఉంది. బంధువుల వద్ద అడగ్గా తమవద్దకు రాలేదని చెప్పారు. అద్దంకిలోని గుండ్లకమ్మ నది ప్రాంతం అంతా వెతికారు. అయినా జాడ కనబడలేదు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బెట్టింగ్‌లకు పాల్పడితే రౌడీషీట్ ఓపెన్ చేస్తాం

- ఆన్‌లైన్ బెట్టింగ్‌లపై ప్రత్యేక నిఘా
- ఎస్పీ తుషార్ డూడీ



బాపట్లటౌన్: బెట్టింగ్‌లకు పాల్పడితే రౌడీషీట్ ఓపెన్ చేస్తామని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆన్‌లైన్‌లో రోజుకొక రకమైన బెట్టింగ్ యాప్‌లు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. వివిధ ఆఫర్స్‌తో బెట్టింగ్ ఫ్రీ అంటూ యువతను ఆకర్షించి వారి జీవితాన్ని నాశనం చేస్తున్నాయన్నారు. ఒకసారి ఆడి చూద్దాం అని సరదాగా మొదలుపెట్టి వీటి బారిన పడిన యువకులు బయటికి రావడమనేది కష్టతరమైన విషయమన్నారు. ఈ బెట్టింగ్స్‌కి అలవాటు పడ్డ వాళ్లు అప్పుల పాలు కావడమే కాకుండా.. చేసిన అప్పులు తీర్చలేక చివరకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఆన్‌లైన్ బెట్టింగ్‌పై నిఘా ఉంచామన్నారు. బెట్టింగ్ ముఠాలు రేపల్లె, చీరాల, అద్దంకి వంటి మరికొన్ని ప్రదేశాల్లో వారి కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. దానికి అనుగుణంగా గతంలో బెట్టింగ్‌లు నిర్వహిస్తూ వివిధ పోలీస్ స్టేషన్లలో పట్టుబడిన 39 మంది కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. చీరాల-1 టౌన్‌లో రెండు కేసుల్లో 11 మంది, రేపల్లె టౌన్‌లో ముగ్గురు, వేమూరు పోలీస్‌స్టేషన్‌లో ఆరుగురు, కొల్లూరులో ఒకరు, చీరాల టూ టౌన్‌లో ఒకరు, వేటపాలెంలో 9 మంది, అద్దంకిలో 8 మందిని గతంలో అరెస్ట్ చేశామన్నారు. కొత్తగా ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడే అవకాశం ఉన్నా వారిపై నిఘా ఉంచామన్నారు. బెట్టింగ్ కార్యకలాపాలను కట్టడి చేసేందుకు ప్రత్యేక పోలీస్ బృందాలను సిద్ధం చేశామన్నారు.

కేవీకేలో శాస్త్రీయ సలహా మండలి సమావేశం

గుంటూరురూరల్: శ్రీవేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రీయ సలహా మండలి సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. సోమవారం నగర శివారుల్లోని లాంఫాంలోని కేవీకేలో ప్రధాన శాస్త్రవేత్త, హెడ్ డాక్టర్ ఎం.యుగంధర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. పశు విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ జేవీ రమణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పరిశోధనశాలల్లో రూపుదిద్దుకుంటున్న సాంకేతికతను రైతులకు చేరవేయటంలో కృషివిజ్ఞాన కేంద్రాలు కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. వివిధ రంగాల్లో శిక్షణ, నైపుణ్యాల వృద్ధి కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించి గ్రామీణ యువతకు వ్యవసాయం, అనుబంధ రంగాల్లో నిష్ణాతులుగా తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ శారదజయలక్ష్మీదేవి మాట్లాడుతూ శాస్త్రీయ సలహా మండలి సూచనలు, సాంకేతిక పరిజ్ఞానం రైతులకు అందించాలని అభిప్రాయపడ్డారు. ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ సీఈవో డాక్టర్ శ్రీనివాసరావు, విస్తరణ సంచాలకులు డాక్టర్ బి. శోభామణి, డాక్టర్ శివన్నారాయణ, పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు నరసింహారావు, ఎల్ఆర్ఎస్ హెడ్ డాక్టర్ ముత్తారావు మాట్లాడారు.

250 కుటుంబాలు..మూడు కొళాయిలు

- వేమూరు అంబేడ్కర్ నగర్ కాలనీలో తాగునీటి ఎద్దడి
- రైల్వే ట్రాక్ దాటి నీరు తెచ్చుకుంటున్న కాలనీ వాసులు
- ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయాందోళన
- పట్టించుకోని అధికారులు

వేమూరు: వేసవికి ముందే వేమూరు గ్రామ పంచాయతీలోని అంబేడ్కర్ నగర్ కాలనీ వాసులకు తాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. జనవరి నుంచే నీరు కోసం ఇబ్బందులు పడుతున్నారు. తాగు నీటి సమస్య గురించి పంచాయతీ కార్యదర్శికి పలుసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పంచాయతీ అధికారులు వెంటనే చర్యలు తీసుకుని సమస్య పరిష్కారం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



అంబేడ్కర్ నగర్‌లో తాగు నీటి కోసం పడిగాపులు పడుతున్న మహిళలు

కాలనీలో మూడు కొళాయిలే..

అంబేడ్కర్ నగర్ కాలనీలో 250 కుటుంబాలు నివసిస్తున్నాయి. కాలనీలో మూడు కొళాయిలు వేశారు. అరకొరగా నీరు సరఫరా చేస్తుండడంతో సరిగా అందక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో నీటి కోసం రైల్వే ట్రాక్ దాటి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఎప్పుడు రైలు వస్తోందో తెలియక కాలనీ భయాందోళనకు గురవుతున్నారు.

నా దృష్టికి వచ్చింది..

అంబేడ్కర్ నగర్ కాలనీ ప్రజల తాగు నీటి సమస్య నా దృష్టికి వచ్చింది. ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేస్తాం.

వి భూపతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి

పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు



అంబేడ్కర్ నగర్‌లో తాగునీరు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. పంచాయతీ అధికారులు పట్టించు కోవడం లేదు. తాగు నీటి సమస్యపై పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం కూడా అందజేశాం.

బొనిగల అగస్టీన్, సీపీఎం నాయకుడు

ఇబ్బందులు పడుతున్నాం...



తాగునీటి కోసం నానా బాధలు పడుతున్నాం. వేసవిలో మరింత అవస్థలు పడుతున్నాం. సమస్యను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలి.

దాసరి సుందరమ్మ, అంబేడ్కర్‌నగర్, వేమూరు.

చేతి పంపులు కూడా వేయలేదు



గ్రామ పంచాయతీ అధికారులు కనీసం చేతి పంపులు కూడా వేయలేదు. తాగునీరు రాక, చేతి పంపులు లేక నీటి కోసం నానా ఇబ్బందులు పడుతున్నాం. పంచాయతీ అధికారులు చేతి పంపులు వేయాలి. తాగు నీరు సక్రమంగా సరఫరా చేయాలి.

బొడ్డు నాగ మల్లేశ్వరి, అంబేడ్కర్ నగర్, వేమూరు.